క్లుప్తంగా

వైద్యుల సూచనలు పాటిస్తే ఆరోగ్యం


ఎ.కోడూరులో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రవితేజ

కె.కోటపాడు : గ్రామాల్లో ప్రజలు వైద్య సిబ్బంది అందించే ఆరోగ్య సలహాలను తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి రవితేజ సూచించారు. ఎ.కోడూరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామస్తులకు వైద్య సేవల్ని అందించారు. సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనల్ని ఆచరించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. 112 మందికి ఓపీ వైద్యంతో పాటు ఉచితంగా మందులను ఇచ్చారు. గర్భిణులకు ప్రత్యేక జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి

నర్సీపట్నం : గ్రామస్థాయిలో పార్టీ బలపడేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీఎస్ వర్మ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో బలంగా ఉండాలంటే బూత్ స్థాయి నుంచి గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాళ్ల సుబ్బారావు, మండల అధ్యక్షులు బోళెం శివ, నక్క శివశంకర్, అడిగర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీఎన్ రోడ్డు పునరుద్ధరణ పనులు


కొమళ్లపూడి వద్ద కొత్తగా వేసిన తారురోడ్డు

బుచ్చెయ్యపేట : మండలంలోని భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో గోతుల పూడ్చి వేత పనులు జోరుగా సాగుతున్నాయి. కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, విజయరామరాజుపేట, పీడీ పాలెం, శింగవరం, లోపూడి తదితర గ్రామాల వద్ద భారీ గోతులుపడి ప్రజలు రాకపోకలకు, రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు సమస్యపై పలువురు నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసికెళ్లారు. వెంటనే గోతులను పూడ్చి తారు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికార్లకు విప్ ధర్మశ్రీ సూచించారు. దీంతో గ్రామాల వద్ద గోతుల్లో పిక్క, రాయిబుగ్గితో లెవిలింగ్ పనులు చేపట్టారు. లెవిలింగ్ పూర్తయిన ప్రదేశాల్లో తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

వీరవల్లి శివారు గ్రామాల్లో 'గడప గడపకు' నేడు

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం శివారు గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండవ రోజు శివారు గ్రామాలైన కొత్తూరు, లక్ష్మీపురం, ఎరుకువాడల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యటిస్తారని, అనంతరం గ్రామంలో కొత్తగా నిర్మించిన హెల్త్ వెలెనెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన


కుళాయి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరులో జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయి కనెక్షన్ పనులకు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ పనులకు రూ.70 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, నాయకులు పడాల అప్పలనర్సయ్య, చింతా వెంకటనారాయణమూర్తి పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమం

- అందుకే ధైర్యంగా మీ ముందుకు వస్తున్నాం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గణేష్
- జగనన్న కాలనీలో పూర్తయిన ఇంటికి ప్రారంభోత్సవం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


జగనన్న కాలనీలో పూర్తయిన ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గొలుగొండ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారు. అందుకే ధైర్యంగా ప్రజల ఇంటి వద్దకే వస్తున్నాం.. అని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం ఏఎల్ పురం మేజర్ పంచాయతీ శివారు గొల్లపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. నవరత్నాల పేరిట ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. అర్హతే కొలమానంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేయడం వల్లే, ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామని, ఇలాంటి గొప్ప సీఎంకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. స్థానిక సమస్యల్ని తెలుసుకుని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ విభాగం మహిళా అధ్యక్షురాలు, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీలు బుల్లి ప్రసాద్, మామిడి కృష్ణ, ఏఏసీ చైర్మన్ సత్యనారాయణతో పాటు సర్పంచ్‌లు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గృహం ప్రారంభం

గ్రామానికి చెందిన కిల్లాడ దేవి జగనన్న కాలనీలో తనకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేయడంతో, దానిని ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయడం వలనే లక్షలాది కుటుంబాలకు నీడ దొరికిందన్నారు. ఇక్కడి జగనన్న కాలనీలో 70 మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశామన్నారు. పేదల పట్ల సీఎం జగన్‌కు ఎంతో ప్రేమ ఉందని, అందుకే రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు సొంతింటిని పొంది, ఆనందంగా ఉన్నారని తెలిపారు.

19 గిరిజన గ్రామాలకు విద్యుత్

- రూ.6 కోట్లతో ప్రతిపాదనలు. ఆమోదం వచ్చాక పనులు-డీఈ సురేష్‌బాబు
- డీఈ కార్యాలయం ఎదుట గిరిజన గ్రామస్తుల ఆందోళన


గిరిజనులతో మాట్లాడుతున్న డీఈ

కొయ్యూరు/నర్సీపట్నం : మండలంలో 19 గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్టు ఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ జి.సురేష్‌బాబు గిరిజన యువకులకు తెలిపారు. బూదరాళ్ల పంచాయతీలో కొత్తపల్లి, చల్దిగెడ్డ, తూములోవ, బొడ్డుమామిడి గ్రామస్తులు తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం నర్సీపట్నం డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై డీఈ వారితో మాట్లాడుతూ బూదరాళ్లతో పాటు ఎం.భీమవరం, యు.చీడిపాలెంలో కలిపి 19 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఇప్పటికే ప్రతిపాదించినట్టు తెలిపారు. గతంలో సౌర విద్యుత్ అందించిన 13 గ్రామాలతోపాటు, మిగిలిన గ్రామాలకు కూడా త్వరితగతిన విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనుమతులు రాగానే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యువకులు వారి బాధల్ని వెల్లబోసుకున్నారు. విద్యుత్ లేకపోవడంతో వివాహమైనప్పటికీ, జీవిత భాగస్వామి తమ గ్రామంలో ఉండేందుకు ఇష్టపడట్లేదని మొరపెట్టుకున్నారు. 2013లో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేసి ఐదేళ్ల పాటు కరెంట్ ఇచ్చారన్నారు. సోలార్ ప్లాంట్ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం కూడా అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అదించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ ఆందోళనలో ఆదివాసీల సంఘం కన్వీనర్ కొర్రా రమణబాబు, వి.పండుబాబు, బాలరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కె.కోటపాడు : కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో చేరాలనుకునేవారు తమ పదో తరగతి మార్కుల లిస్ట్, టీసీలను వెంట తీసుకురావాల్సిందిగా సూచించారు. ఈ నెల 2న మానవత నైతిక విలువలు, 3న పర్యావరణ విద్యపై పరీక్షలను కళాశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి సంవత్సరంలో ఈ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షకు హాజరుకావాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మాడుగుల రూరల్ : మండలంలోని చింతలూరు, వీరనారాయణం గ్రామాల్లో గురువారం ఉపాధి పనుల్ని పథకం ఏపీడీ బి.శ్రీనివాసరావు పరిశీలించారు. ఫీల్డ్ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 2,69,541 పనిదినాలు కల్పించామన్నారు. ఇందుకు రూ.7.05 కోట్లు వేతనాదర్లకు అందించినట్లు తెలిపారు. మాడుగుల క్లస్టర్ పరిధిలో 12 కోట్ల 63 లక్షల, 452 పనిదినాల ద్వారా, రూ.33.24 కోట్లు చెల్లించామన్నారు. ఆయన వెంట టెక్నికల్ సహాయకుడు దాడి జగదీష్, సంబంధిత గ్రామ ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రంథాలయ సందర్శన అలవాటు చేసుకోండి'


గ్రంథాలయంలో సభ్యులుగా చేరిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి దమయంతి

నర్సీపట్నం: విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు రావటం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి పి.దమయంతి సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు పలు అంశాలను బోధించారు. పాఠశాల విద్యతో పాటు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. ఇంగ్లిష్ టీచర్ స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఉపాధ్యాయులు పి.నూకరాజు విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ లక్ష్మీరాజేశ్వరి కాగితాలతో పూలసజ్జను తయారు చేయటంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 55 మంది పిల్లలు, పెద్దలను గ్రంథాలయంలో సభ్యులుగా చేర్చుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం ఫీడర్ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గొండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో విద్యుత్ లైన్లకు అనుకొని ఉన్న చెట్లను తొలగించడంతో పాటు లైన్ మరమ్మత్తు పనుల వల్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

20న ఛలో విజయవాడ

మాడుగుల : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న జరగనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. గురువారం మాడుగులలోని భవణ నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత నేత వైఎస్సార్ 2007లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, దాదాపు 2 లక్షల మందికి సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘనాయకులు వాయిబోయిన శేఖర్, కల్లా నాగేశ్వరరావు, గుమ్మాలు సీతారామ్, వియ్యపు సింహాద్రి, పల్లా నూకరాజు, తులసీరామ్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. రెవాడలో భవన నిర్మాణ కార్మికులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు వాయిబోయిన శేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దుక్క ఈశ్వరరావు, అచ్చిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

దేవరాపల్లి : తామరబ్బ పంచాయతీ పల్లపుకోడాబు గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ టోకురి రామకృష్ణ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, గరిశింగి సర్పంచ్ గూడెపు రాము, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, భుగత వెంకటరమణ తదితర్లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

నాతవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న భూ రీసర్వే పథకంలో రైతులకు శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ పి.కనకరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రెండు విడతల రీసర్వేలో అవకతవకలు లేకుండా విజయవంతంగా జరిగాయన్నారు. ప్రస్తుతం కొత్తగా గన్నవరం, చెర్లోపాలెం, యం.బెన్నవరం రెవెన్యూ గ్రామాల్లో చేసే రీసర్వే పనుల్ని చిత్తశుద్ధితో పూర్తి చేయాలన్నారు. రైతులు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్‌ఐ నారాయణరావు, సర్వేయరు బాలరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

చోడవరం : మండలంలోని గవరవరం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ హరిచందన్ వైద్య పరీక్షలు జరిపారు. 80 మందికి పరీక్షలు చేయగా వీరిలో 18 మందిని శస్త్ర చికిత్సలు చేసేందుకు ప్రత్యేక బస్సులో విశాఖలోని శంకర్ ఫౌండేషన్‌కు తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్యాంప్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

నాతవరం : నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదుతోపాటు, జరిమానా విధిస్తామని నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలంలోని నర్సీపట్నం-తుని రోడ్డులో గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, లైసెన్సుల్లేని, అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె. మురళీకృష్ణ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. తాండవ రిజర్వాయర్, సరుగుడు జలపాతాలు చూసేందుకు వచ్చే వారి దృష్ట్యా వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డుపై ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.

'తూర్పు కాపులకు బీసీ సర్టిఫికెట్లు'


తూర్పు కాపులకు బీసీ సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: అర్హులైన తూర్పుకాపులకు బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మాకవరపాలెంలో తూర్పుకాపులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బీసీ సర్టిఫికెట్లు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తూర్పు కాపులకు నియోజకవర్గ వ్యాప్తంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే అర్హతలున్న తూర్పుకాపులకు బీసీ సర్టిఫికెట్లు జారీ చేయాలని నాలుగు మండలాల తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, తూర్పు కాపు మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, తహసీల్దార్ ప్రసాద్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

వీఆర్ఏపై దాడి గర్హనీయం

చీడికాడ : వీఆర్ఏ సింహాచలంపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటీశ్వరరావు తెలిపారు. గురువారం దండిసురవరంలో బాధిత వీఆర్ఏ సింహాచలంను పరామర్శించారు. భూ సర్వే పనులు నిర్వహిస్తున్న వీఆర్ఏపై అదే గ్రామానికి చెందిన పిల్లా రాజు దాడికి దిగడాన్ని ఖండించారు. ఆయన వెంట మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడుతో పాటు మండల వీఆర్ఏల సంఘం నేతలు శివ, నాగేశ్వరరావు తదితరులున్నారు.

పోలిపల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ట


అమ్మవారిని సన్నిధిలో భక్తులు

మాడుగుల : స్థానిక నవర వీధిలో వెలసిన పోలిపల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ట గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మహిళా కోలాటం అలరించింది. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు

- వీరవల్లి అగ్రహారంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వీరవల్లి అగ్రహారంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు


కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పడాల సత్యారావుకు పింఛను నగదు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్ : గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఇంటింటికీ వస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీరవల్లి అగ్రహారంలో గురువారం స్థానికులను వారింటి వద్దే కలిసి, సంక్షేమ లబ్ధిని వివరించారు. ఏ కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో.. గణాంకాలతో తెలిపారు. గ్రామానికి వచ్చిన ఆయనకు మహిళలు హారతులు పట్టారు. జల్ జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ల కోసం రూ.90 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. శివారు గ్రామాలైన కొత్తూరు, ఎరుకువాడలకు చెరో రూ.4 లక్షలు, లక్ష్మీపురానికి రూ.25 లక్షలు కేటాయించామన్నారు. కొళాయి పనుల తర్వాత పూర్తి స్థాయిలో డ్రైనేజీలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఐరన్ విద్యుత్ పోల్స్ స్థానంలో సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న వైర్లను సరిచేయాలని విద్యుత్ ఏఈని ఆదేశించారు. తమ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేసినట్టు తెలిపారు. కాపు వీధిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా, ఎందుకు ప్రారంభించలేదని స్థానిక నేతల్ని ప్రశ్నించారు. రాయితీ ధరలకు సరకుల్ని అందిస్తున్న మహిళా మార్టును సద్వినియోగం చేసుకోవాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అందించాలని అధికారుల్ని ఆదేశించారు.

సాంకేతిక కారణాలు వల్ల పింఛను రాని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆప్యాయంగా పలకరించి, ఆర్థిక సాయం అందించారు. తాకాసి నారాయణమ్మ అనే వృద్ధురాలికి రూ.2000, తండ్రిని కోల్పోయిన పాతాళ డింపుల్ శ్రీవల్లికి రూ.1500, నగదు అందించి ఐదో తరగతి తర్వాత తానే చదివిస్తానని హామీ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కోన రాజరాజేశ్వరికి రూ.3000 సాయం చేశారు. అనంతరం గ్రామంలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో ముచ్చటించారు. తినుబండారాలు అందించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్‌లు వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరావు, యడ్ల కళావతి, గొల్లవిల్లి సంజీవిరావు, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గణహరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు, స్థానిక నాయకులు సయ్యపురెడ్డి నారాయణరావు, దాడి రాజేశ్వరావు, బోగాది శంకరావు, బోగాది జోగారావు, ఇల్లపు పిట్టనాయుడు, కోన శ్రీను, పచ్చికూర రామారావు, తాటికొండ ఈశ్వరావు, కోట్ని శ్రీరామమూర్తి, పడాల అప్పలనాయుడు, గొల్లవిల్లి రాజేష్, పెరుమాళ్ల వెంకట్రావుతో పాటు మార్కెట్టు చైర్మన్ శానాపతి కోండలరావు, అధికార్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛన్ మంజూరు

పోతనపూడి శివారు కొండయ్యపాలెం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పడాల సత్యారావుకు ప్రతి నెల డయాలిసిస్ నిమిత్తం ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేల పింఛను మంజూరయింది. ఈ నగదును గురువారం వీరవల్లి సచివాలయంలో డిప్యూటీ సీఎం అందించారు.

మరుపాక వీఆర్పీపై ఫిర్యాదు


ఎంపీడీవోకు సమస్యలు వివరిస్తున్న జాబ్‌కార్డు మహిళలు

రావికమతం : ఉపాధి హామీ పథకం మరుపాక వీఆర్పీ సత్యవతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ జాబ్‌కార్డు మహిళలు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకన్నబాబుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్పీ సత్యవతి పని ప్రదేశానికి పూర్తిగా రావట్లేదన్నారు. ఆమె భర్త జోక్యం పెరిగి, డిమాండ్ లేని పనులు చేయించి, తమకు వేతనం రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. మూడు వారాలుగా వేతన బకాయిలున్నాయని, అడుగుతున్నా పట్టించుకోవట్లేదని ఎంపీడీవోకు మొరపెట్టుకున్నారు. కొన్ని గ్రూపులకు మాత్రమే పనులు కల్పిస్తూ, తమకు అన్యాయం చేస్తున్నట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాబ్‌కార్డు మహిళలు వి.వరలక్ష్మి, ఎం.లక్ష్మి, ఎ.రమ్య, రమణమ్మ, ఎం.జగది, సత్యవతి తదితరులున్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు


యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న కె.కోటపాడు సీఐ తాతారావు, ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి : చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు యువకులకు హితవు పలికారు. మండల కేంద్రం దేవరాపల్లి కొబ్బరి తోట సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనంలో యువకులు గంజాయి సేవిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో గురువారం ఆ భవనాలను సీఐ తాతారావు, ఎస్‌ఐ నాగేంద్రలు తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న జి.రాము, ఎం.మనివర్మ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఆరా తీయగా రంధ్రం ఉన్న గాజు సీసాలో వాటర్‌పోసి, ఆ రంధ్రం ద్వారా సిగరెట్ తాగితే మత్తు వస్తుందన్నారు. వీరిద్దరికే ఆ విధంగా సిగరెట్ తాగే అలవాటు ఉందని, వీరి వద్ద గంజాయి కానీ, లిక్విడ్ గంజాయి కానీ లేదన్నారు. వీరిపై దొంగతనం కేసులు కూడా ఉన్నట్టు తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన


రైవాడలో పౌర హక్కులపై మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి, ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి : పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరని తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎస్‌ఐ డి.నాగేంద్ర అన్నారు. రైవాడలో గురువారం పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు కాటపల్లి అప్పారావు, సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, పంచాయతీ కార్యదర్శి టి.లక్ష్మి, వీఆర్వో బి.నాగేశ్వరరావు, మహిళా పోలీస్ కె.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు మృతి తీరనిలోటు


నాగరాజు కుటుంబ సభ్యులతో డిప్యూటీ సీఎం

చీడికాడ : దళితనేత నాగరాజు మృతితో మంచి మనిషిని కోల్పోయామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆటో ప్రమాదంలో ఖండివరానికి చెందిన దళితనేత, పాత్రికేయుడు ఎద్దు నాగరాజు బుధవారం మరణించారు. ఖండివరంలో గురువారం మృతదేహం వద్ద బూడి నివాళి అర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నేతలు సుంకర శ్రీనివాసరావు, మోసూరి సన్నిబాబు, షేకు సూర్యనారాయణ, శీరంరెడ్డి సూర్యనారాయణ, తాడి సాగర్, కొండబాబు, యాళ్ల అమ్మతల్లినాయుడు తదితరులున్నారు.